# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## సోషల్ మీడియా-సవాల్

**పత్రికా స్వేచ్ఛ** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కులో రాజ్యాంగ నిర్మాతలు పత్రికా స్వేచ్ఛనూ చేర్చారు. అయితే ప్రత్యేకంగా, వ్యవస్థాపరంగా సమాచార సాధనాలపై మొదటినుంచీ కొంత నియంత్రణ అనేది ఉంటూ వస్తున్నది. ఉదాహరణకు పత్రికలకు సంబంధించి ఏర్పాటుచేసిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా. దానికో చైర్మన్ బాధ్యుడిగా ఉండటం, జవాబుదారీతనాన్ని తేవడం అనేవి తెలిసిందే. కానీ కమ్యూనికేషన్ స్వరూపం మారిపోయింది. కొత్తకొత్త రూపాల్లో సామాజిక మాధ్యమాలు వచ్చి సమాజాన్ని కమ్మేస్తున్నాయి. భౌగోళిక సరిహద్దులు చెరిగిపోయాయి. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, టెలిగ్రామ్.. ఇలా కుప్పతెప్పలుగా సామాజిక మాధ్యమ వేదికలు వెలిశాయి. ప్రజలు వీటికి అలవాటుపడటంతో సమాచార మార్పిడి, పంపిణీ వేగంగా జరిగిపోతున్నాయి. ఆధునిక సాంకేతికత ద్వారా ఒనగూడే సౌకర్యాలకు సానుకూలత, ప్రతికూలత అనే రెండు ముఖాలు నాణేనికి చెరోవైపు అన్నట్టుగా ఉంటాయి. ఈ వేదికలు భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు పెట్టని కోటగోడలుగా విరాజిల్లుతున్నాయి. వార్తా ప్రసారం ప్రజాస్వామీకరణకు గురవుతున్నది. ఈ రోజు ప్రతి సామాన్యుడూ ఓ రిపోర్టరే. మరోవైపు ఈ సౌకర్యం తీవ్రమైన దుర్వినియోగానికీ గురవుతుండటం మనం చూస్తున్నాం. దాపరికం అంటూ ఏమీ లేదు, అంతా పారదర్శకమే. అదే సమయంలో నియంత్రణ వ్యవస్థలంటూ లేకపోవడం వల్ల కొన్ని శక్తులు లేదా పార్టీలు వ్యవస్థీకృతంగా సామాజిక మాధ్యమాన్ని వాడుకుంటున్నాయి. ప్రజల ఆలోచనలను తమకు అనుకూలంగా మలచుకుంటున్నాయి. ఆలోచనలను అదుపు చేసేందుకూ వాడుకుంటున్నాయి. సంఘవిద్రోహ శక్తులూ జాతివ్యతిరేక కార్యకలాపాలకూ వీటినే ఆశ్రయిస్తున్నాయి.

మన దేశంలో సామాజిక మాధ్యమాల యాప్‌లను నిర్వహిస్తున్న కంపెనీల్లో అత్యధికం బహుళజాతి సంస్థలకు చెందినవే. మన గడ్డ, మన జనం, మన సమాజం పట్ల పట్టింపు, ఎరుక వాటికి ఉండే అవకాశం లేదు. ఇక్కడి డాటాతో పాటుగా లాభాలూ ఎగరేసుకు పోతుంటాయవి. ప్రభుత్వం ఏదో ఒక రూపంలో నియంత్రణకు ప్రయత్నిస్తే సోషల్ మీడియా సంస్థలు ప్రతిఘటించడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎన్‌క్రిప్టెడ్ డాటా ఇచ్చేందుకు అవి ససేమిరా అంటున్నాయి. అత్యధిక జనాదరణ కలిగిన వాట్సాప్ మెసెంజర్ మీడియా వివాదం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చాంశమైంది. 2021 ఐటీ రూల్స్‌కు లోబడి ఉండాలని ఒత్తిడి చేస్తే భారత్‌లో తమ కార్యకలాపాలు నిలిపివేస్తామని సంస్థ ఏకంగా బెదిరింపులకు దిగడం గమనార్హం. వైరల్ అవుతున్న మెసేజ్‌ను మొదటగా పంపిన వ్యక్తి అంటే మూలకర్త వివరాలు తెలుసుకునే వీలు కల్పించాలని సూచించే 4 (2) నిబంధనను ఢిల్లీ హైకోర్టులో వాట్సాప్ సవాల్ చేసింది. వ్యక్తులు, గ్రూపుల మధ్య అత్యధిక స్థాయిలో సమాచార మార్పిడి జరిగే ఈ మెసెంజర్ మాధ్యమం హఠాత్తుగా అందుబాటులో లేకుండా పోవడమనేది ప్రస్తుత పరిస్థితుల్లో చాలామందికి అనూహ్యమైన విషయం. యాపిల్ కూడా ఈ తరహాలోనే వ్యవహరిస్తున్నది. ప్రభుత్వాలు జాతీయ భద్రతను కారణంగా చూపి కమ్యూనికేషన్ వ్యవస్థపై పట్టు బిగించాలని చూస్తుంటాయి. అదే సమయంలో మీడియా సంస్థలు భావప్రకటనా స్వేచ్ఛ పరిరక్షణ కోసం ప్రతిఘటిస్తుంటాయి.

మరి ఈ సమస్యను కొలిక్కి తేవడం ఎలా అని పరిశీలిస్తే మనమూ సొంత యాప్‌ను అభివృద్ధి చేసుకోవడం అనేది ఒక పరిష్కారంగా మనకు కనిపిస్తుంది. చైనా లాంటి కొన్ని దేశాలు ఈ విధానాన్ని అమలుచేయడమే కాకుండా సోషల్ మీడియాపై కఠినమైన ఆంక్షలను అమలుచేస్తున్నాయి. దీనివల్ల దేశాల మధ్య కమ్యూనికేషన్ అడ్డుగోడలు మళ్లీ మొలుస్తాయి. పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తయారవుతుంది. అంతర్జాతీయ ప్రామాణిక నియంత్రణ వ్యవస్థను రూపొందించుకోవడం వల్ల వైరుధ్యాలు పరిష్కారమవుతాయని భావించవచ్చు. అందుకు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం తరహాలో బహుళపక్ష ఒడంబడికలు కుదుర్చుకోవాల్సి ఉంటుంది. అందుకు సామాజిక మాధ్యమ సంస్థల సహకారంతో సాంకేతిక ప్రొటోకాల్స్ రూపొందించుకుంటే వాట్సాప్ తరహా ప్రతిష్టంభనలు తలెత్తకుండా ఉంటాయి.

# తగ్గిన పోలింగ్ మోదీని కంగారు పెడుతున్నదా?

**ఈ ఏడాది జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ సాధించేందుకు ప్రధాని మోదీకి ప్రజల్లో ఉన్న అపారమైన ప్రజాదరణపైనే పాలక భారతీయ జనతా పార్టీ ప్రధానంగా దృష్టి సారించింది. కానీ, ఓటింగ్ శాతం తగ్గితే ఆ పార్టీ అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో తొట్రుపడవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా ఏడు దశల్లో జరుగుతున్న సంగతి తెలిసిందే. ఐదేండ్ల క్రితం నమోదైన 69 శాతంతో పోలిస్తే.. శుక్రవారం నాడు జరిగిన రెండో దశ పోలింగ్‌లో 65 శాతం ఓటింగ్ నమోదైంది.**



**బీమన్ ముఖర్జీ**

ఒక సర్వ సమగ్రమైన జాతీయ ప్రచారాంశం (నెరేటివ్) అనేది లేదని స్వతంత్ర రాజకీయ విశ్లేషకులు, రచయిత నీలాంజన్ ముఖోపాధ్యాయ అన్నారు. పాలకపక్షం లేదా పోటీలో అందరికంటే ముందున్న పార్టీని కాస్త తొట్రుపడేలా చేసే పలు కారణాలున్నాయని ఆయన పేర్కొన్నారు. సాధారణంగా ఒకే అంశంపై ఎక్కువగా ప్రచారం జరిగితే పోటీలో ఉన్న అగ్రగామి పార్టీ ఘనవిజయం సాధిస్తుందని చెప్పారు.

**అయితే ఇప్పటి వరకు ఉన్న ట్రెండ్ ప్రకారం.. ప్రస్తుత ఎన్నికల్లో వివిధ నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలు, అంశాలపైనే ప్రచారం జరుగుతున్నదని, అందులో స్థానిక నాయకుల నాయకత్వ పటిమ తుది ఫలితంలో తేడాను చూపుతుందని ముఖోపాధ్యాయ చెప్పారు.**

ఎండల వల్ల కొంతమంది ఓటర్లు రాకపోవడం, బీజేపీ మద్దతుదారుల్లో ఎటూ గెలుస్తామనే ధీమా అందుకు కారణమని పలువురు విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రతిపక్షం చాలా బలహీనంగా ఉన్నందున, ప్రధాని పదవికి అభ్యర్థిని ఇప్పటికీ గుర్తించనందున అధికార పార్టీ తిరిగి గద్దెనెక్కడం ఖాయమని వారు నమ్ముతున్నారు.

భారత్‌లోని కశ్మీర్‌లో సైనిక శిబిరంపై ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని బాలాకోట్‌పై వైమానిక దాడి చేయాలనే ప్రభుత్వ నిర్ణయంతో 2019 ఎన్నికల్లో ఓటర్లు బీజేపీకి ఘనంగా మద్దతు పలికారని ముఖోపాధ్యాయ తెలిపారు. అవినీతి, మహిళల భద్రత సంబంధిత సమస్యలపై ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంపై ఓటర్లు కోపం పెంచుకున్నారు. ఆ కారణంగా 2014లో మొదటిసారి మోదీ విజయం సాధించారు. ఆ తర్వాత బాలాకోట్ అంశం రెండోసారి అధికారంలోకి రావడానికి బీజేపీకి తోడ్పడిందని నిర్ధారణ అయింది. అయితే ఈ ఎన్నికలు 2014, 2019 కంటే పూర్తిగా భిన్నమైనవని ముఖోపాధ్యాయ చెప్పారు.

కానీ, ముందస్తుగా వస్తున్న సంఖ్యలపై అతిగా అంచనా వేయకూడదని ఆయన హెచ్చరించారు. ఎందుకంటే, 'బీజేపీకి అనుకూలంగా ఇప్పటికీ సైలెంట్ వేవ్ ఉండొచ్చు. ఆ వేవ్ వెంటనే స్పష్టంగా కనిపించదు' అనేది ఆయన అభిప్రాయం. బీజేపీ ఇప్పటికీ మెరుగైన స్థితిలోనే ఉండొచ్చని, కానీ కచ్చితంగా గెలుస్తుందని చెప్పలేమని ముఖోపాధ్యాయ పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఎన్నికల్లో ఓటమి ఎదురవుతుందనే భయంతోనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మైనారిటీ సమాజంపై దాడి చేయడం, మెజారిటీ వర్గమైన హిందువులను ఆకర్షించేందుకు మళ్లీ తమ సాంప్రదాయ పద్ధతులకు మళ్లడం ఇదే సూచిస్తున్నదని చెప్పారు.



**ముస్లింలు చొరబాటుదారులు అని, ఎక్కువ మంది పిల్లలు గలవారని, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ చొరబాటుదారులకు తమ సంపదను పంచుతుందని పశ్చిమ రాజస్థాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ ప్రజలను హెచ్చరించడం సోషల్ మీడియాలో గతవారం వైరల్‌గా మారిన వీడియోలో చూడవచ్చు.**

కాంగ్రెస్ నేతృత్వంలోని శక్తివంతమైన ప్రాంతీయ ప్రతిపక్ష పార్టీల కూటమికి వ్యతిరేకంగా పోటీ చేస్తున్న మోదీ-బీజేపీ గెలవడం ఖాయమని అనేక మంది విశ్లేషకులు అంచనా వేశారు. తమ మద్దతుదారుల ఓట్లు చీలకుండా ఉండేందుకు అనేక నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులను కూటమి రంగంలోకి దించింది.

2019 పార్లమెంట్ ఎన్నికల్లో హిందూ ఓటర్ల బలమైన మద్దతుతో 37 శాతం ఓట్లను సాధించిన బీజేపీ లోక్‌సభలోని 545 సీట్లలో 303 స్థానాలను గెలుచుకున్నది. పార్లమెంట్‌లో మెజారిటీ సాధించాలంటే లోక్‌సభలోని కనీసం సగం సీట్లు లేదా 272 సీట్లను గెలవాలి.

ఓటింగ్ శాతం తగ్గడం వల్ల బీజేపీ ఓడిపోతుందని చెప్పడం తొందరపాటు అవుతుందని సీ-ఓటర్ సంస్థ వ్యవస్థాపకుడు యశ్వంత్ దేశ్‌ముఖ్ చెప్పారు. ఓటింగ్ శాతం తగ్గడమనేది నియోజకవర్గాల వారీగా ప్రభావం చూపుతుందని అన్నారు. ఐదేండ్ల కిందటితో పోలిస్తే.. ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో కొన్ని రాష్ర్టాల్లో బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సహా బీజేపీ బలంగా ఉన్న అనేక రాష్ర్టాల్లో ఈ విడదలో ఎన్నికలు జరిగాయి. 2019 ఎన్నికల్లో నమోదైన 69 శాతంతో పోలిస్తే.. మొదటి దశలో కూడా దాదాపుగా 65 శాతమే పోలింగ్ నమోదైంది. తొలుత అంచనా వేసినట్టుగానే ప్రారంభ దశలో ఓటర్లు తక్కువగా ఉత్సాహం చూపినట్టు స్పష్టంగా కనిపించింది.**

గతేడాది చివర్లో జరిగిన ఐదు రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలు సార్వత్రిక ఎన్నికల్లోనూ తిరిగి ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న అంచనాలను పెంచాయి.

**గట్టి పోరాటానికి అవకాశముంది...**

ఉత్తర భారత్‌లోని ఉత్తరప్రదేశ్‌లో కూల్చివేసిన మసీదు ప్రాంగణంలో రామాలయ నిర్మాణాన్ని ఎక్కువగా ప్రచారం చేయడం పట్ల హిందూ ఓటర్లలో ఉత్సాహం మోదీ-బీజేపీ అధికారంలో కొనసాగుతాయనే అంచనాలను మరింతగా పెంచింది.

ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల పర్యటించిన రాజకీయ విశ్లేషకురాలు స్మితా గుప్తా.. ఆ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మతపరమైన అంశాలు ఓట్లను తెచ్చిపెట్టే అవకాశాలు సన్నగిల్లాయని చెప్పారు. అటువంటి అంశాలు తమ జీవితాలను మెరుగుపరుస్తాయా? ఉద్యోగాలు సంపాదించి పెడతాయా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారని స్మితా గుప్తా తెలిపారు. చాలా మంది బీజేపీ పట్ల అసంతృప్తిగా ఉన్నారని, అయితే వారు ప్రతిపక్షాల పట్ల ఉత్సాహంగా ఉన్నారని దానర్థం కాదని, బీజేపీ మెజారిటీని తగ్గించాలని ప్రజలు కోరుకుంటున్నట్టు తనకు అర్థమైందని స్మితా గుప్తా అన్నారు. 'హిందూ-ముస్లింల మధ్య అంతరం తొలగిపోలేదు. కానీ, దాని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. దాని స్థానంలో కులం మళ్లీ ప్రధాన అంశంగా మారింది' అని గుప్తా చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని సాంప్రదాయిక ఓటింగ్ ధోరణులను ప్రస్తావిస్తూ.. కొన్ని వర్గాలవారు తమ సొంత కులాలకే ఓటు వేయడానికి ఇష్టపడతారని ఆమె పేర్కొన్నారు.

ఓటరు నిరుత్సాహానికి ప్రధాన కారణాలు నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉండటమని, బీజేపీకి మరోసారి స్పష్టమైన మెజారిటీ ఇస్తే.. కుల ఆధారిత ఉద్యోగ రిజర్వేషన్లను తొలగిస్తుందని లేదా తగ్గిస్తుందనే భయం ప్రజల్లో కనిపించినట్టు ఆమె అన్నారు. నిరాదరణకు గురైన కొన్ని కులాలు, తెగలకు.. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లోని సీట్లలో కొంత భాగాన్ని భారత రాజ్యాంగం రిజర్వ్ చేసింది. తనకు అంతగా ఆదరణ లేని ప్రాంతాలకు ముఖ్యంగా దక్షిణాది రాష్ర్టాలకు విస్తరించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సీట్లు గెలుచుకునే అవకాశాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు.

**'అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా పోలింగ్ శాతం తగ్గడం గురించి ఆందోళన చెందాల్సిందే. అలా తగ్గడం అనేది పార్టీకి ఉపయోగకారిగా ఉండదు. కానీ, పదేండ్ల పాటు అధికారంలో ఉన్న తర్వాత ఇలాంటివి ఎదురుకాక తప్పదు' అని రాజకీయ విశ్లేషకుడు హరీశ్ రామస్వామి అన్నారు. ఒకే వ్యక్తిపై (మోదీ) అధికంగా ఆధారపడటం వల్ల ప్రతికూలతలు కూడా ఉంటాయని ఆయన చెప్పారు. 'ఒక్కరే అన్ని చేయగలరని మీరు అనుకుంటున్నారా?' అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయని ఆయన తెలిపారు.**

**రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్ల ప్రజలు అనేక అవస్థలకు గురవుతున్నారు. ఇక రాష్ట్ర భవిష్యత్తు అంధకారమే అనుకుంటున్న సమయంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ ఛానల్‌కు నాలుగు గంటలకుపైగా సమయాన్ని కేటాయించి ఓ అద్భుతమైన ఇంటర్వ్యూ ఇచ్చారు. అంతే బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రస్తుత పాలకులు చేస్తున్న అబద్ధపు ప్రచారాలన్నీ పటాపంచలైపోయాయి. అంతేకాదు, ప్రజలకున్న అనుమానాలన్నీ తొలగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అసలు చర్చను పక్కదోవ పట్టించడానికే బీఆర్ఎస్, కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నదని, వాటిలో ఎలాంటి వాస్తవాలు లేవని రాష్ట్ర ప్రజానీకానికి అర్థమైపోయింది.**

# హామీల పేరిట కాంగ్రెస్ దగా



**తుంగ బాలు**
99859 30246




ఏప్రిల్ 24, సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు మిర్యాలగూడలో కేసీఆర్ బస్సుయాత్ర మొదలైంది. అబద్ధపు హామీల పునాదులపై ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజలు పడుతున్న గోసను చూడలేక ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఈ యాత్రను ప్రారంభించారు. మిర్యాలగూడ నుంచి సిద్దిపేట వరకు 24 పట్టణాల్లో 17 రోజుల పాటు సాగే యాత్ర ఇది. ఈ యాత్రలో ప్రత్యక్షంగా పాల్గొన్నాకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదని అర్థమైంది.

రైతులు, మహిళలు, ఆటో కార్మికులు, విద్యార్థులు, వృద్ధుల నుంచి మొదలుకొని అన్నివర్గాల ప్రజలు ఉద్యమ నాయకుడికి తమ బాధలను చెప్పుకోవడం గమనించాను. నీరు లేక మా పంటలు ఎండిపోతుంటే మేమెలా బతికేదని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు? రాష్ట్రంలో పండిన పంటను కొనే పరిస్థితి లేదంటే ఇంకా బోనస్ ఎక్కడిది? డిసెంబర్ 9వ తేదీనాడే చేస్తామన్న రుణమాఫీ ఇంకా అమలుకు నోచుకోలేదు. ఉపాధి హామీ కూలీలకు రూ.12 వేలు ఇస్తామన్నా, ఆ హామీ ఊసే లేదు. 24 గంటల నిరంతర విద్యుత్తు లేక మోటర్లు కాలిపోతున్నాయి. మొత్తంగా ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులే రాష్ట్రంలో మళ్లీ దాపురించాయని ప్రజలు కేసీఆర్ వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు. పరిశ్రమల్లో జనరేటర్ల శబ్దం మళ్లీ వినపడుతున్నది. వీధుల్లో తాగునీటికి కటకట మళ్లీ మొదలైంది. ప్రతి ఊరిలో ట్యాంకర్లు దర్శనమిస్తున్నాయి. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లు కనుమరుగయ్యాయి. కేసీఆర్ కిట్ కానరావడం లేదు. 102 సేవలు అందడం లేదంటూ ప్రజలు కేసీఆర్‌కు విన్నవించుకుంటున్నారు. ఇక ఆటో డ్రైవర్లయితే తమ పరిస్థితి అయితే మరి అధ్వాన్నంగా తయారైందంటూ వాపోయారు.

రేవంత్‌రెడి తమను నిండా ముంచారని, మెగా డీఎస్సీ అని తమను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని నిరుద్యోగ యువతీ యువకులు ఫిర్యాదయ్యారు. మాకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని, హాస్టళ్లలో కనీస వసతులు లేవని, కలుషిత ఆహారంతో గురుకుల విద్యార్థుల మరణాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయని, అయినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థులు చెప్పారు. దళితబంధు అనే బృహత్తర పథకం ద్వారా గత ప్రభుత్వం రూ.10 లక్షలు అందజేస్తే, కాంగ్రెస్ తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామన్నది. రూ.12 లక్షలేమో గానీ రూ.12 వేలు కూడా ఇవ్వడం లేదని దళిత మహిళలు కేసీఆర్ వద్ద బోరుమన్నారు. రాష్ట్రంలో ఇలాంటి దుర్భర పరిస్థితులు నెలకొంటే 'మేం లంకె బిందెల కోసమే అధికారంలోకి వచ్చాం' అన్నట్టుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడటం నిజంగా సిగ్గుచేటు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు ఐదు నెలలు కావస్తున్నది. అయినా ఎన్నికలకు ముందు ఆ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు నిరసనలు తెలియజేస్తున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన రీతిలో బుద్ధిచెప్తామని ప్రజలు బల్లగుద్ది చెప్తున్నారు. తెలంగాణను ప్రేమించే వ్యక్తి ఒక్క కేసీఆరేనని ప్రజలకు ఇప్పటికే అర్థమైంది. అందుకే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతామని ప్రజలు చెప్తున్నారు. బస్సుయాత్రకు వస్తున్న విశేష స్పందనే అందుకు మంచి ఉదాహరణ.




## కమీషన్ తీసుకొని వ్యాక్సిన్‌కు అనుమతి!

*కరోనా వ్యాక్సిన్‌కు అనుమతి ఇచ్చే విషయంలోనూ బీజేపీ అవినీతికి పాల్పడింది. ఓ కంపెనీ నుంచి రూ.200-300 కోట్లు కమీషన్ తీసుకుంది. అందుకే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా బలవంతంగా ప్రజలకు వ్యాక్సిన్ వేశారు. దాని దుష్ప్రభావాల కారణంగానే ఇప్పుడు ప్రజలు మరణిస్తున్నారు.*

**- డింపుల్ యాదవ్**
*సమాజ్‌వాదీ పార్టీ నాయకురాలు*

# సోషల్ మీడియాలో విష ప్రచారానికి చెక్!

**భారత రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రభావం అంతా ఇంతా కాదు. 2014 లోక్‌సభ ఎన్నికలు మొదలుకొని నేటివరకు సోషల్‌మీడియా హవానే నడుస్తున్నది. ఒక హోటల్‌లో చీపురుకట్టతో మోదీ ఊడుస్తున్నట్టు కన్పించిన ఫొటో సోషల్ మీడియాలో ఓ సంచలనం. 'చాయ్‌వాలా ప్రధాని కావొద్దా?', 'ఏక్ బార్ మోదీ సర్కార్' అనే నినాదాలను జనంలోకి బలంగా తీసుకెళ్లింది సోషల్ మీడియానే. ఆ తర్వాత మోదీ తన ప్రతీ మూమెంట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తాజాగా తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూడా సోషల్ మీడియా అయిన 'X'లో తన ఖాతా తెరిచారు. అకౌంట్ తెరిచిన మొదటిరోజు 27 వేల మంది ఫాలోవర్స్ వచ్చారంటే సోషల్‌మీడియాపై ప్రజల్లో ఉన్న ఆసక్తి ఇట్టే అర్థమవుతుంది.**



**అస్కాని మారుతీసాగర్**
90107 56666



ఇన్నాళ్లు లక్షలాది మంది సోషల్ మీడియా ద్వారా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ ఇలాంటి వాటిని వినియోగించి కేసీఆర్ గురించి చాలా అంశాలు చెప్పారు, తెలుసుకున్నారు. నిందలేసిన వారు కొందరైతే ప్రశంసలు కురిపించిన వారు ఎందరో. అయితే కేసీఆర్ రోజువారీ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలు ఇకనుంచి సోషల్ మీడియా ద్వారా అందరికీ తెలియబోతున్నాయి. ఆయనే నేరుగా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వబోతున్నారు.

కేసీఆర్ గురించి, ఆయన ఆలోచనల గురించి గతంలో చిన్న సమాచారం సోషల్ మీడియాలో వస్తే గంటల్లో లక్షల వీక్షణలు వచ్చేవి. అది సెకెండ్ హ్యాండ్ సమాచారానికే. ఇప్పుడు నేరుగా ఆయనే తన అభిప్రాయాలను చెప్తున్నారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా అసలైన సమాచారం నెటిజన్లకు తెలియబోతున్నది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణం మిస్ కమ్యూనికేషన్ కూడా కావచ్చని భావించారు కాబోలు ఇక నేరుగా రంగంలోకి దిగారు. గతంలో క్యాడర్ గురించి కేసీఆర్ ఏమనుకుంటున్నారో తెలిసేది కాదు. పైగా ఆయన ఎవ్వర్నీ కలువరనే ప్రచారం సైతం సోషల్ మీడియాలో బాగా వైరలైంది. మంత్రులు కూడా ఆయన అపాయింట్‌మెంట్ కోసం వెయిటింగ్‌లో ఉండే వారని సోషల్‌మీడియాలో వైరి పక్షాలు బాగా ప్రచారం చేశాయి. ఇకనుంచి ఇలాంటి సత్యాసత్య సమాచారాలకు తావు లేకుండా ఏది నిజమో అదే సమాచారం నెటిజన్లకు చేరబోతున్నదని భావించాలి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత కేసీఆర్ నిరుత్సాహ పడలేదు. సరికదా చాలా వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారని ప్రస్తుతం ఆయన చేస్తున్న పర్యటనలను చూస్తే అర్థమవుతుంది. గత పదేండ్లుగా మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజలపై పడిన ప్రభావాల గురించి కేసీఆర్ చాలా లోతుగా ప్రజలకు వివరిస్తున్నారు. అంతేకాదు, ఇటీవల ప్రధాన స్రవంతికి చెందిన ఓ టీవీ ఛానెల్‌లో కేసీఆర్ ముఖాముఖి తర్వాత ఆయన తెలంగాణ సమస్యల సాధన పట్ల ఎంత పట్టుదలతో ఉన్నారో కూడా ప్రజలకు మరోసారి అర్థమైంది. ఆ రోజు ఆ ఛానల్‌లో వచ్చిన వీక్షకుల సంఖ్య చరిత్ర సృష్టించింది. ఈ సమాచార విప్లవ విస్తృతి వెల్లువెత్తుతున్న సందర్భంలో ఆయన యాక్టీవ్ రోల్ ప్లే చేయాలనుకున్నారేమో. అందుకే పార్టీ ఆవిర్భావ దినోత్సవం... సోషల్ మీడియాలోకి కేసీఆర్ అరంగేట్రం ఒకేసారి జరిగాయి. ఆ నాడున్న మీడియా దాని ప్రభావం ఓ మోస్తరుగానే ఉండేది. కానీ నిక్కచ్చిగా ఉండేది. నేడు పరిస్థితి మారి పోయింది. సమాచారాన్ని ఎవ్వరూ నియంత్రించలేరు, నిర్దేశించనూ లేరు. నిజా నిజాలు క్షణాల్లో ప్రజల్లోకి వెళ్తున్నాయి. అబద్ధాలు సైతం అంతే వేగంగా చక్కర్లు కొడుతున్నాయి.

ఒకప్పటి ప్రింట్ మీడియా, తదనంతరం వచ్చిన ఎలక్ట్రానిక్ మీడియాలను వెనక్కినెట్టి ఇప్పుడు న్యూ మీడియా రాజ్యమేలుతున్నది. ప్రధానంగా ఏ రాజకీయ పార్టీలు చూసినా తమకంటూ ఒక సోషల్ మీడియా వారియర్స్‌తో ఒక వింగ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నాయి. వారితో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ప్రజల్లోకి తమ ప్రభుత్వ లేదా పార్టీ విధానాలను ఎంత మేర తీసుకువెళ్లాలో చెప్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాయి. ప్రధానంగా ఎన్నికల సమయంలో వాళ్లతో ప్రత్యేకంగా సమావేశమవుతూ దిశానిర్దేశం చేస్తున్నాయి.

**తెలంగాణ రాష్ట్రం విషయానికి వస్తే మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్' వేదికలో 4.5 మిలియన్ల ఫాలోవర్స్‌తో నిత్యం ట్వీట్లు చేస్తూ అగ్రస్థానంలో ఉండగా, అసదుద్దీన్ ఓవైసీ, హరీశ్‌రావు, కల్వకుంట్ల కవితలు రెండు, మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. ఇలా రాజకీయ నాయకులందరూ సోషల్ మీడియాను కేంద్రంగా చేసుకొని ప్రత్యర్థులపై పంచులు, పదునైన మాటలతో అస్త్రాలను ఎక్కుపెడుతున్నారు. తాము చెప్పాలనుకున్న విషయాలను బహిర్గతం చేస్తున్నారు.**

తాజాగా కేసీఆర్ సోషల్ మీడియాను వేదికగా చేసుకోవడం పట్ల ఆయన అభిమానులు, ఫాలోవర్స్ సంబురంలో తేలియాడుతున్నారు. చేసింది చెప్పుకోకపోవడం, చేయాలనుకున్న దాన్ని వివరించకపోవడం తప్పు అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ నడిచే దారిలోనే తాను నడవాలని భావించిన కేసీఆర్ నిర్ణయం పట్ల ఇటు పార్టీలో, అటు ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది. కోట్లాది మందిని ప్రభావితం చేసే కేసీఆర్ లాంటి రాజకీయ నాయకుడు సోషల్ మీడియాలో ఉంటే తనకు, రాష్ట్రానికి సంబంధించిన వాస్తవ సమాచారం ప్రజలకు చేరే అవకాశం ఉంటుంది. తనపై జరిగే అవాస్తవాల కట్టడికి కూడా ఇది మంచి మార్గమే. ఏదేమైనా సోషల్ మీడియాతో ఉంటే అనుక్షణం ప్రజలతో ఉన్నట్టేనని రాజకీయా నాయకులు భావిస్తున్నారడంలో అతిశయోక్తి లేదు.

*(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)*